క్లుప్తంగా

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కొవ్వూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. స్టాంపులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు, కార్యాలయానికి వంద మీటర్ల లోపు విక్రయించరాదన్న నిబంధన అమలుపై తనిఖీలు చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.సత్యకిశోర్ వెల్లడించారు. ఈ విచారణ నివేదికను సబ్ రిజిస్ట్రార్‌కి అందజేశామన్నారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఇ.వెంకటేశ్వరరావును వివరణ కోరగా జిల్లా రిజిస్ట్రార్‌కు తగు చర్యల నిమిత్తం పంపుతున్నామని వెల్లడించారు.

కొవ్వూరులో రైళ్లు నిలపాలని వినతి

కొవ్వూరు: కరోనాకు ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే అన్ని రైళ్లను యథావిధిగా ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం స్థానిక స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ప్రముఖులు, వ్యాపారులు, ప్రజల నుంచి సంతకాలు సేకరించి అందించినట్లు నాయకులు తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సాధారణ పరిస్థితులు నెలకొన్నా రైళ్లను ఆపకపోవడం సరికాదన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు దగ్గు రాధాకృష్ణ, పడాల గంగాధరరావు, పెన్షనర్ల అసోసియేషన్ నాయకుడు పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా చూడాలి

తాళ్లపూడి: ఆడపిల్లల్లో రక్తహీనత సమస్య రాకుండా చూడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రమణ నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలన్నారు. ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్

ఉండ్రాజవరం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా మాతా, శిశు మరణాలను నివారించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్, విద్యాశాఖ, డీఆర్‌డీఏ, జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగాలతో ఏఎన్ఎం, ఆశ, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు రక్తహీనత సమస్య రాకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఐరన్ మాత్రలు అందించాలన్నారు. వైద్యాధికారి ఉషారాణి, సీడీపీఓ శ్రీలక్ష్మి, ఎంఈఓ పీవీఎస్ నాగరాజు, ఏపీఎం సుబ్బారావు, సీహెచ్‌ఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పురుగు మందులతో అనర్థాలు

గోపాలపురం: పురుగు మందుల అవశేషాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ పి.రంగారావు అన్నారు. వెంకటాయపాలెంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొలాల్లో రైతులు వాడే పురుగు మందులతో జరిగే అనర్థాలు, వాటి నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు, సర్పంచ్ మేకా సతీష్‌బాబు పాల్గొన్నారు.

అవగాహనతో క్షయ నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న వసుంధర

నిడదవోలు రూరల్: అవగాహనతో క్షయ నివారణ సాధ్యమని జిల్లా క్షయ నివారణ అధికారి వసుంధర అన్నారు. తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఇక్కడ జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలున్న వారికి అవగాహన కల్పించి నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు సుధీర్‌కుమార్, దివ్య పాల్గొన్నారు.

నిడదవోలు: క్షయ నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని జిల్లా క్షయ నివారణ అధికారి ఎస్.వసుంధర అన్నారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్, తాడిమళ్ల పీహెచ్‌సీలలో క్షయ నివారణకు తీసుకుంటున్న చర్యలు, రోగులకు అందుతున్న వైద్యంపై గురువారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ప్రధానమంత్రి ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని వారికి మెరుగైన పోషకాహారం అందించాలని కోరారు. టీబీ సూపర్‌వైజర్ ఆర్.పోతురాజు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడేందుకే..

- శిశువుల ఆరోగ్య రక్షణకు నియోనేటర్ వాహనం
- అత్యవసర సేవలకు వినియోగం
- 108 వాహనాలతో అనుసంధానం
- అందుబాటులో 24 గంటల సేవలు



పెరవలిలో నియోనేటర్ వాహనం గురించి వివరిస్తున్న వాహన సిబ్బంది



వాహనంలో అత్యాధునిక పరికరాలు

పెరవలి: కంటికి రెప్పలా శిశువులను కాపాడేందుకు.. వారి ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శిశువులకు అత్యాధునిక వైద్యాన్ని అందించేందుకు అవసరమైన వాహనాలను జిల్లాకు ఒకటి చొప్పున ప్రభుత్వం అందజేసింది. శిశు మరణాల నివారణే లక్ష్యంగా సమకూర్చిన ఈ వాహనాలకు నియోనేటల్ అని నామకరణం చేసి 108 వాహనాలకు అనుసంధానం చేశారు. ఇందులో భాగంగా తణుకు ప్రభుత్వాసుపత్రికి నియోనేటల్‌ను అందుబాటులో ఉంచారు. ఇది కానూరు, పెరవలి పీహెచ్‌సీ పరిధిలోని శిశులకు సేవలు అందిస్తుంది. దీనిపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పెరవలి మండల పరిధిలో ముగ్గురు శిశువులకు అత్యవసర వైద్యం అందించి ఆసుపత్రిలో చేర్పించారు. సేవలు అవసరమైన వారు 108కు కాల్ చేస్తే అవసరమైన చోటుకు ఈ వాహనం వెళ్లి ప్రాణాపాయంలో ఉన్న శిశువులకు ప్రాథమిక వైద్యం అందించి, ఆసుపత్రుల్లో చేరుస్తోంది. ఈ వాహనంలో ఉండే అత్యాధునిక పరికరాలు శిశువుకు ప్రాణహాని లేకుండా ఆసుపత్రికి క్షేమంగా తీసుకువెళ్లే వరకూ కాపాడతాయి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 28 రోజుల వయసు కలిగిన చిన్నారులకు అత్యవసర వైద్య సేవల కోసం ఈ నియోనేటర్ అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచారు. ఈ వాహనంలో ఉండే అత్యాధునిక పరికరాల గురించి వివరంగా తెలుసుకుందాం.

ఇంక్యూబేటర్: నెలల నిండకుండానే పుట్టిన, తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు ఈ పరికరం ఉపయోగపడుతుంది. నెలలు నిండినప్పటికీ శరీర భాగాలు పూర్తిగా అభివృద్ధి చెందక తక్కువ ఉష్ణోగ్రత (హైపోథెర్మియా) గల శిశువులను ఆసుపత్రికి తరలించేందుకు మార్గం మధ్యలో ఈ పరికరాన్ని వినియోగిస్తారు.

వెంటిలేటర్: ఇది కృత్రిమ శ్వాస అందించే పరికరం. అప్పుడే పుట్టిన శిశువుతో పాటు 28 రోజుల వయసు గల పసికందులు తమంతట తాము శ్వాస తీసుకోలేకపోవచ్చు. అలాంటి స్థితిలో ఉన్న శిశువులకు ఈ పరికరం ద్వారా కృత్రిమ శ్వాస అందిస్తారు.

మానిటర్: శిశువు ఆరోగ్య స్థితిని ఈ పరికరం ద్వారా గమనిస్తారు. శిశువు గుండె వేగం, రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ శాతం, శరీర ఉష్ణోగ్రత ప్రామాణికాన్ని నిర్దేశించేందుకు ఈ వైద్య పరికరం సాయపడుతుంది. దీనితో పాటు సిరంజ్ అండ్ ఇన్ఫ్యూజన్ పంప్ ఉంటుంది. నవ జాతి శిశువులను ఇతర ఆస్పత్రులకు తరలిస్తున్నప్పుడు వారికి అవసరమైన మందులను నిర్దేశిత మోతాదులో అందజేసేందుకు ఈ వైద్య పరికరం ఉపయోగపడుతుంది.

ప్రాణాపాయం లేకుండా..



108 వాహనం లాగే ఇది పేద పిల్లలకు అత్యవసర సేవలు అందించటానికి ప్రవేశపెట్టిన వాహనం. ఇందులో అత్యంత అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారు. దీనివల్ల శిశువులకు ప్రాణాపాయం ఉండదు.

–డీఎస్ రాజు, నియోనేటర్ వాహన సిబ్బంది

శిశు మరణాల నివారణకు..



రాష్ట్ర ప్రభుత్వం శిశు మరణాల నివారణకు నియోనేటల్ 108 వాహనాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయి. శిశులకు అత్యవసర వైద్య సేవలు అందుతాయి. దీనివల్ల ప్రాణాప్రాయం ఉండదు. ఇది పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ వాహనాలు మరిన్ని వాహనాలు రావాల్సి ఉంది.

–గణేష్, నియోనేటర్ వాహన జోనల్ మేనేజర్

సీఎం దృష్టికి కార్మికుల సమస్యలు



కార్మికులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బోస్

రాజమహేంద్రవరం రూరల్: విజ్జేశ్వరం పవర్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని ఎంపీ మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. గురువారం రాజమహేంద్రవరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆయన్ని విజ్జేశ్వరం పవర్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది కలిశారు. తమ సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి సంబంధిత యాజమాన్యంతో చర్చించాలని కోరారు. అక్కడున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు కూడా విద్యుత్ పరిశ్రమ పరిస్థితిని వివరించారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ పవర్ ప్లాంట్ లేఆఫ్ కావడం వెనుక కారణాలు, వేతనాల పరిస్థితి తదితర అంశాలను సీఎం జగన్, విద్యుత్ శాఖ మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళతానన్నారు. అలాగే ఇండస్ట్రీ ప్రమోటర్‌తో కూడా మాట్లాడతానన్నారు. ఇండస్ట్రీ లేఆఫ్ అయింది కాబట్టి నిబంధనల ప్రకారం 50 శాతం వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు.

మది మురిసె.. సంస్కృతి విరిసె



తాళ్లపూడి కరిబండి విద్యా సంస్థలో సందడి చేసినచిన్నారులు

- ముందస్తు సంక్రాంతి సంబరాలు
- భోగి మంటలు, సంప్రదాయ వేషధారణలతో చిన్నారుల సందడి

తాళ్లపూడి: చీకటిని చీల్చే కాంతులు.. అంతా కేరింతలు.. తెలుగువారి సంస్కృతిని చాటే సంబరాలతో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మన సంస్కృతీ సంప్రదాయాలను నేటి యువతకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కరిబండి విద్యా సంస్థల డైరెక్టర్ కరిబండి త్రినాథస్వామి అన్నారు. తాళ్లపూడిలో కరిబండి సుబ్బారావు మెమోరియల్ విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, చిన్నారుల హరిదాసుల వేషధారణలు, ముగ్గుల పోటీలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ మురళీ, అధ్యాపకులు డి.మాధవరావు, గిరి, పాపారావు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి సందర్భంగా వేగేశ్వరపురంలో పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మణరావు చేతుల మీదుగా దుస్తులు పంపిణీ చేశారు. పెద్దేవంలో సిబ్బందికి సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రామకృష్ణ, కార్యదర్శి అలేఖ్య సువర్చల చేతుల మీదుగా నూతన వస్త్రాలు అందజేశారు. గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, కార్యదర్శి హేమంతి పంపిణీ చేశారు.

ఉండ్రాజవరం: సంక్రాంతి పండగను సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని ఎస్సై కె.రామారావు అన్నారు. వడ్లూరు ఉన్నత పాఠశాలలో యువత, విద్యార్థులు, మహిళలకు కబడ్డీ, స్లో సైక్లింగ్, ముగ్గుల తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎస్సై బహుమతులు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ, ఎంపీటీసీ సభ్యులు వేంద్ర రమేష్, రఘుమండ శ్రీను, గంధం మునేశ్వరరావు పాల్గొన్నారు.

నిడదవోలు: మన సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి అద్దం పడుతుందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 50 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. అనంతరం బసివిరెడ్డి పేటలో సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, మేడపాటి సరిత, గోపిరెడ్డి శ్రీనివాస్, కన్వీనర్ అడపా రాజు, రాంబాబురెడ్డి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: శశిధర్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేలివెన్నులో శశి క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. ఇందులో పందలపర్రు, సమిశ్రగూడెం, ఉండ్రాజవరం (నిమ్మతోట), నిడదవోలు బసివిరెడ్డి టీమ్‌లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధించాయి. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.

చాగల్లు: చాగల్లులో సంతూర్ కంపెనీ ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ, చాగల్లు, నెలటూరు ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంతూర్ కంపెనీ ఏఎస్ఎం కె.వెంకటేశ్వరరావు, భవానీ శ్రీనివాస్, దొరబాబు, గ్రంధి రాంబాబు, వెన్న వాసు, కిశోర్ పాల్గొన్నారు.



వడ్లూరులో సైకిల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రామారావు, ప్రజాప్రతినిధులు



నిడదవోలులో పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

లబ్ధిదారుల ముంగిటకే పథకాలు



కొవ్వూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొవ్వూరు: వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం స్థానిక 15వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ఎవరి సిఫార్సులు లేకుండా అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అంతా అండగా ఉండాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, పట్టణ గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, నాయకులు చొటుపల్లి వీరన్న, ముదునూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లక్ష్మీపురంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- లక్ష్మీపురంలో గడప గడపకూ..

దేవరపల్లి: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం లక్ష్మీపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల చెంతకే పథకాలు అందుతున్నాయని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్‌దారులకు ఇంటికెళ్లి మరీ సొమ్ము అందజేస్తున్నట్టు తెలిపారు. అర్హులందరికీ నవరత్న పథకాలు అందుతున్నాయన్నారు. గడప గడపకూ వెళ్లినప్పుడు పేదల ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపిస్తాయన్నారు. ప్రజలంతా సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో 81 గ్రామ సచివాలయాలు ఉండగా, ఇప్పటి వరకూ 75 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహించి 94,769 గడపలను సందర్శించినట్టు ఆయన తెలిపారు. లక్ష్మీపురంలో రోడ్లు, డ్రైన్ల సమస్యను పలువురు చెప్పగా వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి, మాజీ సర్పంచ్ దోనెల్లి జానకీరామ్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యురాలు పఠాన్ హస్మత్ ఉన్నీషా తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం సొంతం



దూబచర్లలో మాట్లాడుతున్న జిల్లా యువజన సంక్షేమ శాఖాధికారి కిశోర్

నల్లజర్ల: నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు రాజీ పడకుండా కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సొంతమవుతుందని జిల్లా యువజన సంక్షేమ శాఖాధికారి దూలం కిశోర్ అన్నారు. దూబచర్ల ఎలైట్ కళాశాల 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన స్వామీ వివేకానంద జయంతి వేడుకలలో కిశోర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే మార్గదర్శకులు అన్నారు. చేసే పనిలో నిజాయితీ ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల సెక్రటరీ దావులూరి ప్రభాకరరావు, ఏఎస్ఐ రాంబాబు, గ్రామ కార్యదర్శి బి.రత్నం, బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్, కళాశాల పూర్వ విద్యార్థి కె.పాండురంగ తదితరులు పాల్గొన్నారు. ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వామీ వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.అరవిందకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఏఎస్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



వేళ్లచింతలగూడెంలో కబడ్డీ విజేతలకు షీల్డ్ అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: నేటి యువత విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సందర్భంగా రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ప్రతిభను వెలికితీయడం అభినందనీయమన్నారు. కబడ్డీ పోటీలు నిర్వహించిన కమిటీ చైర్మన్ ఘంటా మధుకృష్ణను ప్రశంసించారు. మహిళా విభాగంలో కృష్ణా జిల్లా ప్రథమ, విశాఖపట్నం ద్వితీయ, ప్రకాశం తృతీయ, విజయనగరం జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లా, నెల్లూరు జిల్లాలు వరుసగా నాలుగు స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కొవ్వూరు డీఎస్పీ బీవీఎస్ వర్మ, సీఐ అనసూరి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పిన్నమనేని చినబాబు, కొర్లపాటి రాము, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడితే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు, తహసీల్దార్ గంగరాజు

నిడదవోలు: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్సై పి.నాగరాజు హెచ్చరించారు. దీనిపై సింగవరం గ్రామంలో గురువారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. తహసీల్దార్ ఎం.గంగరాజు మాట్లాడుతూ యువత సంప్రదాయ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే సర్వే



డి.ముప్పవరంలో డ్రోన్‌తో సర్వే ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నిడదవోలు రూరల్: రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, భూ వివాదాలు, పొలం గట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూముల రీ సర్వే చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు తెలిపారు. డి.ముప్పవరంలో డ్రోన్లతో భూ సర్వేను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు మాట్లాడుతూ తొలి విడతలో తిమ్మరాజుపాలెంలో రీ సర్వే పూర్తి చేశారని, మిగిలిన గ్రామాల్లో కూడా రైతులపై నయా పైసా భారం లేకుండా సమగ్ర రీ సర్వే చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు సంగినీడి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల ప్రభు, నాగిరెడ్డి సత్తిపండు పాల్గొన్నారు.

వివేకానందుడు ఆదర్శం

నిడదవోలు: యువతకు వివేకానందుని జీవితం ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో సేవా సమితి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ప్రత్తిపాటి సాగర్, వీహెచ్ సుబ్బారాయుడు, వేదుల జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చంద్రవరం గ్రంథాలయంలో వివేకానంద జయంతి నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి వార్డు సభ్యుడు మద్దిపాటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బండి అశోక్‌బాబు పూలమాలలు వేశారు.

జూదరుల అరెస్ట్

కొవ్వూరు: తొగుమ్మిలో పేకాడుతున్న నలుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. వారి నుంచి రూ.22,130 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

శ్రీమన్నారాయణ యజ్ఞం ప్రారంభం



శ్రీపర్వతంపై వేంకటేశ్వరస్వామి వారు



దేవరపల్లిలో స్వామి అమ్మవార్లకు నివేదించడానికి స్వీట్లు, పండ్లు తీసుకెళ్తున్న భక్తులు

దేవరపల్లి: గౌరీపట్నంలో శ్రీపర్వతంపై వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద శ్రీమన్నారాయణ యజ్ఞం, స్వామివారి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురార్పణ, మంటపారాధన, అగ్నిస్థాపనతో కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వేడుకలను పురస్కరించుకుని శ్రీపర్వతం విద్యుత్ దీపకాంతులతో శోభాయమానంగా మారింది. ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల వెంకటరామానుజాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవాలు ఈ నెల 17 వరకూ జరుగనున్నాయి. ఇదిలా ఉండగా దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద గోదారంగనాథస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. గోదా అమ్మవారికి మంగళస్నానాలు చేసి పెండ్లి కుమార్తెగా అలంకరించారు. సాయంత్రం భక్తులు వివిధ రకాల స్వీట్లు, పండ్లు తీసుకువచ్చి అమ్మవారికి నివేదించారు. పల్లంట్లలో కుంతీదేవి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమను ఊరేగించి ధర్మ చెరువులో నిమజ్జనం చేశారు.